కథ

# మానవత్వం

## కె.వి.రామకృష్ణ

కర్ఫ్యూ నీడలో నగరం బిక్కుబిక్కుమంటోంది!

రోడ్లమీద జనసంచారం లేదు. ఏ నిముషంలో ఏం జరుగుతుందోనని ప్రజలందరూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గడపదాటి బయటకు రావడంలేదు.

ఏ ఇంట్లోనూ లైట్లు వెలగడంలేదు. వీధి దీపాలు మాత్రం చీకటిని తరుముతూ తమవంతు బాధ్యతని సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్నాయి. అర్ధరాత్రి వరకూ వాహనాల రొదతో సందడిగా వుండే రోడ్లు నిర్మానుష్యంగా, ప్రళయానికి ముందు ప్రశాంతతలా వున్నాయి. ఆ శ్మశాన నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ మధ్యమధ్యలో పోలీసుల బూట్ల చప్పుడు...

సంధ్య పిల్లల్ని నిద్రపుచ్చి టీవీలో కర్ఫ్యూకు సంబంధించిన వార్తలను వింటూ భర్త ఫోన్ కోసం ఎదురుచూస్తోంది. పనిమనిషి రంగమ్మ పడుకుని చాలాసేపయింది.

సంధ్య భర్త రఘు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్. ఎమర్జెన్సీ సర్వీస్ క్రింద డాక్టర్లంతా విధిగా విధులకు హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయడంతో రఘు నిన్నటి నుంచి హాస్పిటల్‌లోనే ఉంటున్నాడు.

సంధ్య ఆలోచనలు పరిపరి విధాలుగా సాగుతున్నాయి. కడుపునిండా తినక, కంటినిండా నిద్రపోక ఎప్పుడూ పేషెంట్లు... పేషెంట్లు అంటూ పరుగులెత్తే డాక్టర్లంటే ఆమెకు చిన్నతనంనుంచీ వ్యతిరేక భావమే. కారణం... తల్లీ తండ్రీ ఇద్దరూ డాక్టర్లే. ఇంటి పట్టున ఎప్పుడూ ఉండేవారు కాదు. ఎంతసేపూ పేషెంట్లు, హాస్పిటల్... ఇదే వారి లోకం.

సంధ్యను డాక్టర్ చదివించి హాస్పిటల్ బాధ్యతలు కూతురికి అప్పగించాలని వారు ఎంతగానో ఆశపడ్డారు. మెడిసిన్ అంటే తనకున్న అభిప్రాయంవల్ల తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా సంధ్య ఎంబిఏ చేసింది. 'గుమస్తానైనా పెళ్లి చేసుకుంటాను గానీ డాక్టర్ని మాత్రం చేసుకోనని' స్నేహితుల ముందు శపథం కూడా చేసింది.

అనుకున్నదొక్కటి, అయినదొక్కటి అన్నట్లు తనక్కాబోయే భర్త ఏ వృత్తిలోనైతే ఉండకూడదనుకుందో చివరికి ఆ డాక్టర్నే వివాహమాడవలసి వచ్చింది. డాక్టర్ భార్య కావడం తనకు ఇష్టం లేకపోయినా ఒకందుకు మాత్రం సంతోషించింది. కారణం... భర్త గవర్నమెంటు డాక్టర్ కావడం. ప్రైవేట్ డాక్టర్స్‌లా వేళకు ఇంటికి రాకపోవడం అన్న సమస్యలేదు. నిర్దిష్టమైన పనివేళలు వుంటాయి కాబట్టి టైముకి ఇంటి పట్టున వుంటారని ఆశపడింది.

మత కలహాల పేరిట నగరంలో జరుగుతున్న మారణహోమంవల్ల జనజీవనం అస్తవ్యస్థమయింది. ఎక్కడ చూసినా కత్తిపోట్లు, కాల్పులు. ఇలాంటి సమయంలో హాస్పిటల్‌కు వెళ్లడం అంత మంచిది కాదని భర్తకు సలహా ఇచ్చింది. కానీ రఘు ఆమె మాటలు పెడచెవిన పెడుతూ 'ఈ పరిస్థితుల్లో డాక్టర్లంతా భయపడి ఇళ్లల్లో కూర్చుంటే ఆ అభాగ్యులను కాపాడేదెవరు?' అంటూ నిన్న పొద్దున్ననగా హాస్పిటల్‌కు వెళ్లారు. ఇంతవరకూ ఇంటికి రాలేదు. అయినా ప్రతి రెండు మూడు గంటలకు ఇంటికి ఫోన్ చేస్తూనే వున్నాడు.

***

డాక్టర్ రఘు హాస్పిటల్‌లో బిజీగా తిరుగుతున్నాడు. కత్తిపోట్లకు గురైన అమాయకులు, రాళ్ళదెబ్బలు తిన్న అభాగ్యులు రక్తం వోడుతూ హాస్పిటల్‌కు వస్తున్నారు. బాధితుల బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణమంతా మారుమ్రోగుతోంది. క్షణ క్షణానికి పెరిగిపోతున్న క్షతగాత్రులకు సేవ చేయడానికి, వారికి అవసరమైన వైద్యసహాయం అందించడానికి ఆసుపత్రి సిబ్బంది ఎంతో ప్రయాస పడుతోంది.

ఆ సమయంలో రక్తంతో తడిసి ముద్దయిన ఓ వ్యక్తిని స్ట్రెచర్ మీద తీసుకొచ్చారు పోలీసులు.

ఇన్‌స్పెక్టర్ హడావుడిగా రఘు దగ్గరకొచ్చి, ఆ వ్యక్తికి సంబంధించిన వివరాలు చెప్తున్నాడు. డాక్టర్ రఘు ఇనస్పెక్టర్ చెప్తున్నది పూర్తిగా వినకుండా కత్తిపోట్లకు గురైన వ్యక్తి వద్దకు చేరుకున్నాడు.

రక్తపు మడుగులో వున్న ఆ వ్యక్తి వంటి మీద దాదాపుగా పది పదిహేను కత్తిపోట్లు వున్నాయి. ప్రస్తుతం అతని పరిస్థితి చూస్తుంటే ఆ వ్యక్తి బ్రతికే అవకాశాలు చాలా తక్కువ. శరీరంలోని ముఖ్య భాగాలు కత్తిపోట్లకు గురికావడంతో రక్తం చాలా పోయింది.

"నేను చెప్పానుకదా డాక్టర్. వీడే ఆ దామోదర్. నరరూప రాక్షసుడు. ప్రత్యర్థులు అదను చూసి వీడి మీద దాడి చేసారు. నాకెప్పుడో తెల్సు వీడెప్పటికైనా మార్చ్యురీ టేబుల్ మీద పడుకోవలసినవాడేనని. ఇంతకాలం వీడెన్ని అరాచకాలు చేసినా చూస్తూ ఊరుకున్నాం. ప్రజల దృష్టిలో వీడిని ఏమీ చేయలేని అసమర్ధులమయ్యాం. వీడు పోతే నగరంలో ప్రశాంతత ఏర్పడుతుంది, ప్రజలంతా హాయిగా ఊపిరి పీల్చుకుంటారు. నేను మిమ్మల్ని కోరుకునేది ఒక్కటే... వీడి విషయంలో మీరు చూసీ చూడనట్టు వుంటే చాలు. ఇప్పుడు కాకపోయినా ఇంకాసేపట్లో ఎలాగూ వీడు చావడం ఖాయం. వీడి చావుతో నగరానికి పట్టిన పీడ విరగడవుతుంది. చట్టాన్ని కాపాడవలసిన అధికారినైన నేను, ప్రాణాలు కాపాడవలసిన డాక్టరైన మీతో ఇలా మాట్లాడకూడదని నాకు తెలుసు. కానీ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఇలా చెప్పక తప్పడంలేదు" అన్నాడు ఇనస్పెక్టర్.

స్ట్రెచర్ మీదున్న ఆ వ్యక్తిని మరోసారి చూసాడు రఘు. ఎవరి పేరు చెబితే నగరం ఉలిక్కిపడుతుందో, ఎవరి పేరు వింటే పోలీసులు, రాజకీయ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడతాయో... అలాంటి వ్యక్తి ఇప్పుడు మృత్యువుతో పోరాడుతున్నాడు.

"చూడండి ఇన్‌స్పెక్టర్! అతడు దుర్మార్గుడే కావచ్చు. చావుబ్రతుకుల మధ్య నా దగ్గరకు వచ్చిన వారిని కాపాడడం నా ధర్మం. నా బాధ్యతను నేనెన్నడూ విస్మరించను. ఐయామ్ వెరీ సారీ."

"అది కాదు డాక్టర్ నేను చెప్పేది పూర్తిగా..."

"డాక్టర్! మా అన్నను ఎలాగైనా కాపాడండి. డబ్బు ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. మా అన్న మాత్రం మాకు దక్కాలి అంతే!" అన్నాడు అప్పుడే అక్కడికొచ్చిన దామోదర్ కుడిభుజమైన చలపతి.

"సార్! నా భర్త దుర్మార్గుడే కావచ్చు, ఎంతో మంది ఉసురు పోసుకుని ఉండొచ్చు. ఆయనకేదైనా అయితే..." భోరుమంది దామోదర్ భార్య.

"వదినా! ఎందుకేడుస్తావు? అన్నకేంకాదు. నేను చెప్తున్నానుగా! ధైర్యంగా వుండు" అంటూ రఘు వైపు తిరిగి-

"డాక్టర్! మా అన్నను మాకు ప్రాణాలతో అప్పగించండి. మీరూ, పోలీసులు కుమ్మక్కై మా అన్ననేమైనా చేసారంటే సిటీని తగలబెడతాం. అడ్డమొచ్చిన వాళ్లను నరికి పోగులు పెడతాం..." అన్నాడు చలపతి ఆవేశంతో ఊగిపోతూ.


"చూడండి... నేను ప్రాణాలు కాపాడే డాక్టర్నేగానీ మీలా ప్రాణాలు తీసే కసాయిని కాదు. ప్రాణం విలువ మీకు తెలియకపోవచ్చు. డాక్టర్గా నేను చేయవలసినదంతా చేస్తాను. ఆపైన భగవంతుడున్నాడు..." అంటూ ఆపరేషన్కి సిద్ధం చేయమని సిస్టర్కి చెప్పి తన రూమ్వైపు వడివడిగా నడిచాడు రఘు.

***

"రక్తం చాలా పోయింది.

'ఓ నెగటివ్' బ్లడ్ గ్రూప్ ఉన్నవాళ్ళు ఎవరైనా మీలో వున్నారా?" ఆపరేషన్ థియేటర్లోంచి వచ్చిన రఘు అక్కడున్నవాళ్లని అడిగాడు.

కొంతమంది తమది ఆ గ్రూపు కాదన్నారు. మరి కొందరు తమదే గ్రూపో తెలియదన్నారు. వారందరికీ రక్తపరీక్షలు చేసారు. కానీ కావాల్సిన బ్లడ్ గ్రూప్ దొరకలేదు.



రఘుకి ఏం చేయాలో పాలుపోవడంలేదు. బ్లడ్ బ్యాంక్కి ఫోన్చేస్తే ప్రస్తుతం ఆ గ్రూప్ బ్లడ్ తమ దగ్గర లేదన్నారు. అక్కడున్నవాళ్లంతా రఘు ముఖంలోకి ఆందోళనగా చూస్తున్నారు. ఇంతలో ఏదో గుర్తొచ్చినవాడిలా రఘు ఒక్క ఉదుటున ఫోన్ దగ్గరకు పరుగెత్తాడు.

"హలో... నేను సంధ్యా! ఆ... బాగానే వున్నాను. ఏం భయంలేదు. మరేంలేదు. ఇక్కడ ఒక పేషెంట్ చావుబ్రతుకుల మధ్య వున్నాడు. అతనికి కావాల్సిన బ్లడ్ గ్రూప్ దొరకడం కష్టంగా ఉంది. ఇంతలో నువ్వు గుర్తుకొచ్చావు. నీదీ అదే బ్లడ్గ్రూప్ కదా. మనిషినిచ్చి కారు పంపిస్తున్నాను. అతని దగ్గర కర్ఫ్యూ పాస్‌లున్నాయి. భయంలేదు. వెంటనే వచ్చేయ్. పిల్లల్ని రంగమ్మ చూసుకుంటుంది. నేను చెప్పేది అర్థం చేసుకో... ప్లీజ్... థాంక్యూ... థాంక్యూ వెరీమచ్! వుంటాను" అంటూ ఫోన్ పెట్టేసి డ్రైవర్ని కేకేసి ఇంటికి వెళ్లి అమ్మగారిని తీసుకురమ్మన్నాడు.

అక్కడున్నవారందరికీ పరిస్థితి అర్థమయింది.

దామోదర్‌కు రక్తం కావాల్సి వచ్చి డాక్టర్‌గారు తన భార్య రక్తం ఇవ్వడానికి పిలిపిస్తున్నారని గ్రహించారు.

అరగంటలో కారు వచ్చి ఆసుపత్రి ముందాగింది. అక్కడి వాతావరణం ఉద్విగ్నంగా మారింది. కారు దిగిన సంధ్యకి అందరూ చేతులెత్తి నమస్కరిస్తుంటే ఆమెకేమీ అర్థంకాలేదు.

థియేటర్‌లోంచి బయటకి వచ్చిన రఘు భార్యను చూసి "వచ్చేసావా! చాలా థాంక్స్ సంధ్యా" అంటూ సిస్టర్‌ని పిలిచి చేయవలసింది చెప్పి తిరిగి ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాడు.

మూడుగంటల తరువాత నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ ఆపరేషన్ థియేటర్ నుంచి బయట కొచ్చాడు రఘు. అక్కడ కూర్చున్నవారందరూ ఒక్క ఉదుటన లేచి నిలబడ్డారు.

"నేను చేయవలసింది చేశాను. ఒక విధంగా చెప్పాలంటే అతను ప్రాణాపాయం నుంచి దాదాపుగా బయటపడినట్లే. స్పృహలోకి రావడానికి కొంత టైమ్ పడుతుంది."

దామోదర్ భార్య పరుగున వచ్చి "నిజంగా మీరు దేవుళ్ళు డాక్టర్. మీ మేలు జన్మ జన్మలకు మరచిపోలేను" అంది కన్నీళ్లతో.

"లేదమ్మా! ఇందులో నేను చేసింది ఏంలేదు. అతనికి ఆయుష్షు వుంది. బ్రతికాడు...అంతే!" అంటూ తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు డాక్టర్ రఘు.

***

నెలరోజులు గడిచాయి. దామోదర్ నెమ్మదిగా కోలుకుంటున్నాడు.

అతను డిశ్చార్జ్ అయ్యే రోజది. ఆసుపత్రి అంతా కోలాహలంగా వుంది. దామోదర్ అనుచరులు పూల మాలలతో, బాణాసంచాతో తమ నాయకుడికి స్వాగతం చెప్పేందుకు ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు. నగరానికి పట్టిన పీడ వదిలిపోతుందని సంబరపడిన పోలీసులు, దామోదర్ ప్రాణాలతో బయటపడిన విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

దామోదర్ చేతికర్రల సాయంతో నెమ్మదిగా రఘుని సమీపించాడు.



"దేవుని దయ వల్ల తిరిగి మామూలు మనిషయ్యారు. ఇంటికి వెళ్లి రెస్ట్ తీసుకోండి. కొద్ది రోజుల్లో గాయాలన్నీ మానిపోతాయి" అన్నాడు డాక్టర్ రఘు నవ్వుతూ.

దయాదాక్షిణ్యాలు అంటే అర్థం తెలియని దామోదర్ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఇంత కాలం భర్త కళ్లల్లో క్రౌర్యమే తప్ప కన్నీళ్ళు ఎరుగని అతని భార్య దామోదర్ కళ్లల్లో ఉబుకుతున్న నీళ్ళను చూసి నిర్ఘాంతపోయింది.

"ఏమిటి... మీకింకేం భయంలేదని చెప్పాను కదా" అన్నాడు రఘు అనునయంగా దామోదర్ భుజంమీద చేయి వేస్తూ.

అంతే!

ఉన్నఫళంగా రఘు కాళ్లమీద పడిపోయాడు దామోదర్. చుట్టూ వున్నవారు నిర్ఘాంతపోయారు. ఎప్పుడూ ఎవ్వరినీ లెక్కచేయని దామోదర్ ఈ రోజు ఇలా...

"అరెరె.. ఏమిటిది లేవండి!"

"లేదు డాక్టర్... ఇప్పుడు మీముందున్నది ఆ పాత దామోదర్ కాదు. మీ చల్లని స్పర్శ తగిలిన రోజునే కరడుగట్టిన ఆ కసాయివాడు చచ్చిపోయాడు. నిజం డాక్టర్!...నాకు మనుషుల ప్రాణాలంటే లెక్కలేదు. నేనెటువంటి రాక్షసుడినో తెలిసీ మీ భార్య రక్తంతో నాకు ప్రాణభిక్ష పెట్టారు. ఇప్పుడు నాలో ప్రవహిస్తున్నది ఆ చల్లని తల్లి రక్తం. ఆ మహాతల్లి ఇచ్చిన రక్తంతో తిరిగి ప్రాణం పోసుకున్న ఈ దేహం... మళ్ళీ ఆ పాత జీవితాన్ని ఆశ్రయిస్తే నా అంత పాపాత్ముడు మరొకడు ఉండడు. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నాను. ఈ క్షణం నుంచి నా పాత జీవితానికి స్వస్తి చెబుతున్నాను. అంతేకాదు, ఇప్పటివరకూ నేను చేసిన నేరాలను ఒప్పుకుంటూ చట్టానికి లొంగిపోతున్నాను. కోర్టు విధించే శిక్షను నా పాపాలకు ప్రాయశ్చిత్తంగా ఆనందంగా అనుభవించడానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు దామోదర్ గంభీరంగా.

అతను తీసుకున్న నిర్ణయం అటు పోలీసులను దిగ్భ్రాంతి పరచగా, ఇటు అతని అనుచరులను అయోమయంలో పడేసింది.

భర్తను కలవడానికి అంతకుముందే వచ్చిన సంధ్య జరుగుతున్నదంతా చూసింది. ఇంతకాలం డాక్టర్లమీద తను ఏర్పరచుకున్న అభిప్రాయానికి సిగ్గుపడింది. పోలీసులు, చట్టం చేయలేని పనిని మంచితనంతో, మానవత్వంతో తన భర్త సాధించాడు. కరడుగట్టిన రాక్షసుడిని మంచిమనిషిగా మార్చాడు. రఘు లాంటి ఉత్తముడికి భార్య కాగలిగినందుకు ఆమె హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

## ప్చ్! స్నేహా!!

ఓ వైపు టింగణా అయిపోతున్న స్నేహ మరో వైపు కుర్రహీరోయిన్ల పోటీకి తట్టుకుని నిలబడ్డానికి తెగ తంటాలు పడుతోందని చెన్నయ్ సినీజనాల ఉవాచ. అప్పుడెప్పుడో తెలుగులో వచ్చిన విజయశాంతి 'కర్తవ్యం' సినిమాని ఇప్పుడు తమిళంలో 'భవానీ' పేరుతో స్నేహ హీరోయిన్‌గా నిర్మిస్తున్నారు. ఇందులోని పోలీసు పాత్ర కోసం బరువు తగ్గి మరీ కాస్త స్లిమ్ అయి నటిస్తోందిట స్నేహ. ఈ సినిమా అయినా ఆమెకి కొత్త క్రేజ్ తెస్తుందేమో!